RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 281 పేజీలు - 08 శనివారం 05 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

### కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

# పర్యటన

● పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం రేవంత్ ● హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ముఖ్యమంత్రి ఆరా

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళు న్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం?ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. మిగతా2లో...



### విద్యార్థులను తీర్చిదిద్దడంలో

# టీచర్లదే కీలకపాత్ర

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల మార్గనిర్దేశం, మెంటార్‌షిప్ ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారి వ్యక్తిత్వ వికాసానికి బలమైన మిగతా2లో...

## 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

- పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం


2లో

### కేసీఆర్ చాలా మంచోడు.. హుందాగా

# రిసీవ్ చేసుకునేవారు

- కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో మిగతా2లో...

### హద్దులు దాటితే ఎవరిపైనైనా

# చర్యలు తప్పవు

- సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్


2లో



## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం


- లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసానికి పిలుపు

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ మిగతా2లో...

### జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం

# విజయవంతం


జియోసింక్రోనస్ కక్ష్యలోకి దేశ మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియో-ఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం జుూా-05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువ జామున 2గంటల 55నిమిషాలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం జుూా-05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల మిగతా2లో...

# ఢిల్లీలో కుండపోత వర్షం

● జలమయమైన విమానాశ్రయం ● విమాన సేవలకు తీవ్ర అంతరాయం


2లో

### కొండా సురేఖను

# తొలగించారు..

- పొంగులేటి సంగతి ఏమిటి?:

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు


2లో

# జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

బరువు ఉన్న -05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన గ్రూూం-జ 61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది. మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎ.నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈఓఎస్-05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

# కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందు కొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్?ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్? అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగి ంచడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు.

ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉం దని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధా రంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరిం చారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తా యని సూచనప్రాయంగా చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.



# కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి తరఫున ఆహ్వానం అందింది. ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు ఎలా భిన్నంగా ఉంటాయి? పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం వంటి అంశాలపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడాలని నిర్వాహకులు కోరారు. భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడి, ఆవిష్కరణ వ్యవస్థలతో అనుసంధానించడంలో కేటీఆర్‌కు ఉన్న అనుభవం యూరప్‌లోని పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులకు ఉపయోగపడుతుందని తమ ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. భారత్, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల మధ్య పెట్టుబడి సంబంధాలను పెంపొందించడంలో ఆయన దృక్పథం కీలకమని వారు అభిప్రాయపడ్డారు. యూరప్‌లోని ప్రముఖ పెట్టుబడిదారులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విధాన నిర్ణేతలు పాల్గొనే ఈ కార్యక్రమం స్టార్టప్ ఫైనాన్సింగ్, వ్యాపార వృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. గత ఏడాది జరిగిన లక్సెంబర్గ్ వెంచర్ డేస్‌కు 28 దేశాల నుంచి 3,400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 300 మందికిపైగా పెట్టుబడిదారులు, 110 వెంచర్ క్యాపిటల్ ఫండ్ల ప్రతినిధులు ఉన్నారు యూరప్‌కు చెందిన పలు ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

# తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

## ● ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరణ



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు ఆబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు.ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచంనా వేస్తున్నారు,

# విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్లదే కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

పునాది వేయవచ్చని రాష్ట్రపతి పేర్కొన్నారు. అంకితభావంతో, శ్రద్ధతో పనిచేసే ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో స్ఫూర్తిని నింపడంతో పాటు అత్యుత్తమ ప్రతిభను కనబరిచేలా ప్రోత్సహించగలరని ఆమె అన్నారు.ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని నవీకరించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలని, వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని ముర్ము సూచించారు. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు ప్రశ్నించే, విషయాలను లోతుగా తెలుసుకోవాలనే ఆసక్తిని ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ఆమె చెప్పారు. భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు.

# ఢిల్లీలో కుండపోత వర్షం

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# కొండా సురేఖను తొలగించారు

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమె త్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్‌లోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బంది చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితా లోని పేదల భూ ములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమ స్యలపై ప్రశ్ని స్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవ మానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాం కు లు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

## ● పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**07 నుంచి రాష్ట్ర శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్ననేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 06 న ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు.

# కేసీఆర్ చాలా మంచోడు.. హుందాగా రిసీవ్ చేసుకునేవారు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

# జుక్కల్ చౌరస్తా వద్ద బస్సు ప్రమాదం

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** జుక్కల్ చౌరస్తాలో వద్ద బస్సు ప్రమాదానికి గురైతంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందగా, మరో 12 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిలో ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు బిచ్కుంద ఆసు పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధి కారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

# పోలీస్ కానిస్టేబుల్‌పై కత్తితో హత్యాయత్నం

● విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బందిపై దాడి ● తీవ్ర గాయాలపాలైన కానిస్టేబుల్ రామచంద్రు.. ఆరు కుట్లు ● నిందితుడికి రిమాండ్ విధించిన తొర్రూరు కోర్టు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ వస్తం) సెప్టెంబర్ 4:** బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న ఒక పోలీస్ కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన దిగ్భ్రాంతికర సంఘటన తొర్రూరు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు పట్టణంలోని 14వ వార్డులో తీవ్ర కుటుంబ కలహాలు జరుగుతున్నాయని, గొడవను సర్దుమొగాలక స్వయంగా పరిష్కరించాలని డయల్-112 ద్వారా పోలీసులకు ఫిర్యాదు అందింది.సమాచారం అందుకున్న బ్లూకోల్ట్ కానిస్టేబుల్ జాటోత్ రామచంద్రు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భార్యాభర్తల మధ్య జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు ఆయన ప్రయత్నిస్తుండగా, కోటేశ్వరరావు అనే వ్యక్తి అత్యంత తీవ్రమైన రీతిలో రెచ్చిపోయాడు. కానిస్టేబుల్‌ను అసభ్య పదజాలంతో తీవ్రంగా దూషిస్తూ, హఠాత్తుగా కత్తితో దాడికి తెగబడ్డాడు.ఈ ఊహించని దాడిలో కానిస్టేబుల్ రామచంద్రు ఎడమ చంక భాగంలో తీవ్ర రక్తగాయమైంది. వెంటనే స్పందించిన తోటి సిబ్బంది ఆయనను స్థానిక సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు అత్యవసర చికిత్స అందించి, గాయానికి ఆరు కుట్లు వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, పోలీస్ అధికారిపై దాడికి పాల్పడిన నిందితుడు కోటేశ్వరరావుపై పోలీసులు కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై తొర్రూరు సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టారు. నిందితుడిని తొర్రూరు కోర్టులో హాజరుప రచగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించడంతో జైలు కు తరలించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.

# తుమ్మన్‌పేటలో వైభవంగా శ్రీ శ్రీ ఈదమ్మ తల్లి జాతర

● శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో వేడుకలు

● బొడ్రాయి బౌరమ్మ గుడి నుంచి బోనాల ఊరేగింపు

● ఆకట్టుకున్న మహిళా కోలాటం, హైదరాబాద్ పోతురాజుల విన్యాసాలు





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ వస్తం) సెప్టెంబర్ 4:** శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా తుమ్మన్‌పేట గ్రామంలో శ్రీ శ్రీ ఈదమ్మ తల్లి జాతర వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు.గ్రామంలోని బొడ్రాయి బౌరమ్మ గుడి నుంచి ఈదమ్మ తల్లి ఆలయం వరకు మహిళలు వడిబియ్యం, భక్తిశ్రద్ధలతో బోనాలను శిరస్సున ధరించి ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నెరవేర్చారు. **ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా బోనాల కోలాటం, డప్పు కళాకారుల ప్రదర్శనలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హైదరాబాద్ నుంచి విచ్చేసిన పోతురాజుల బృందం చేసిన సంప్రదాయ విన్యాసాలు, ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరించాయి.గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తుల సందడి, బోనాల ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలతో తుమ్మన్‌పేట గ్రామం శోభాస్కరంగా మారింది. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, కళాబృందాల సమష్టి సహకారంతో శ్రీ శ్రీ ఈదమ్మ తల్లి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా ముగిసింది.

# రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డి నకిరేకల్ సభలో స్పష్టమైన ప్రకటన చేయాలి

అసెంబ్లీ సమావేశాల్లో నిధులు కేటాయించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 4:** రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రికి నూతన భవనం మంజూరి చేస్తున్నట్లు నకిరేకల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి అసెంబ్లీ సమావేశాల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వాసుపత్రి ఎదుట కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ రామన్నపేట మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ప్రస్తుతం ఆసుపత్రిలో సరిపడా పడకలు, వైద్య సిబ్బంది, అవసరమైన మౌలిక వసతులు లేక, పోవడంతో, శిదిలావస్థకు చేరిన భవనంతో పేద ప్రజలు దూర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నకిరేకల్ పర్యటనకు వస్తున్న సందర్భంగా రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించవచ్చని అన్నారు.ఇటీవల జిల్లా మంత్రి కోమటిరెడ్డి 6నెలల్లో ఆసుపత్రి పూర్తి చేస్తామని ప్రకటించి రెండు నెలలు కావస్తుందని ఇప్పటికి ఎలాంటి చలనం లేదని అన్నారు.రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎం.డి. జహంగీర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు, కల్లూరి నగేష్,మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బుర్రు అనిల్ కుమార్,మండల నాయకులు గొరిగే సోములు,గాదె నరేందర్,నీల అయిలయ్య, తోలుపునూరి శ్రీనివాస్,శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శానగొండ రాము, పల్లె సత్యం, బావండ్లపల్లి సత్యం,ఎండీ లతీఫ్,ఆముద ఆంజనేయులు, జల్లెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జ్ఞానోదయ పబ్లిక్ స్కూల్లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

● పిల్లలను ప్రత్యేకంగా తయారు చేసి పంపిన తల్లిదండ్రులకు ధన్యవాదములు: ప్రిన్సిపాల్ ఉపేందర్





**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా, ప్రతినిధి, సెప్టెంబర్ 4:** ఖమ్మం శ్రీనివాస్ నగర్, టీచర్స్ కాలనీ, శ్రీ జ్ఞానోదయ పబ్లిక్ స్కూల్లో, శ్రీకృష్ణ జన్మాష్టమి, వేడుకలు, కనుల పండుగగా నిర్వహించడం జరిగింది, విద్యార్థిని విద్యార్థులచే, సంస్కృతి క ,కార్యక్రమాలు, అలరించాయి, అనంతరం, స్కూలు మైదానంలో,శ్రీకృష్ణుడి గోపికల వేషధారణలో ఉట్లు కొట్టడం, అందరినీ ఆకట్టుకునే విధంగా, ఆనందోత్సవాలతో, విద్యార్థులు జరుపు కోవడం జరిగింది,ఈ సందర్భంగా ,ప్రిన్సిపల్ ఉపేందర్ ,మాట్లాడుతూశ్రీకృష్ణాష్టమి ,లేదా జన్మాష్టమి హిందువుల ,ముఖ్యమైన పండుగలలో ఒకటి. ఈ రోజున శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడు జన్మించిన రోజున భక్తిశ్రద్ధలతో పండుగ,జరుపుకుంటారు. శ్రీకృష్ణుడు ధర్మాన్ని కాపాడి, అధర్మాన్ని నిర్మూలించడానికి అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. ఆయన బాల్య లీలలు, భగవద్గీత బోధనలు మనకు ప్రేమ, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి గొప్ప విలువలను , నేర్పుతాయని ఆయన అన్నారుఈ పండుగ సందర్భంగా మా చిన్నారులతో వేడుకలు నిర్వహించడం జరిగింది ."శ్రీకృష్ణుని బోధనలు మన జీవితానికి మార్గదర్శకం. ప్రేమ, సత్యం, ధర్మం మన జీవితంలో ఆచరించడమే శ్రీకృష్ణాష్టమి యొక్క అసలైన సందేశం, అని ప్రిన్సిపల్ అన్నారు

# రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు 100 పడకలు మంజూరు చేయాలి

- సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కామ్రేడ్ రెబ్బాస్ రాములు డిమాండ్




**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 4:** రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు 100 పడకలు మంజూరు చేయించాలని, ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తక్షణమే తీసుకెళ్లాలని ఉద్యమకారుడు కామ్రేడ్ రెబ్బాస్ రాములు డిమాండ్ చేశారు.75 సంవత్సరాలు పూర్తవుతున్న రామన్నపేట ప్రభుత్వ దవాఖాన ఇప్పటికీ 10 నుండి 50 పడకలకే పరిమితమైందని, పాత బిల్డింగ్‌లోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు లేక వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజుకు 500 నుండి 600 మంది రోగులు వస్తున్నా, సరిపడా డాక్టర్లు, అన్ని విభాగాల వైద్యులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు హైదరాబాద్ లేదా నల్లగొండకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు.రామన్నపేట నియోజకవర్గం రద్దయిన తర్వాత ఈ మండలంలోని పలు ప్రభుత్వ సంస్థలు ఇతర మండలాలకు తరలిపోయాయని, గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శాఖ మంత్రులు లక్ష్మారెడ్డి, హరీష్ రావు దృష్టికి, ప్రస్తుత మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి స్థానిక ఎమ్మెల్యేలు వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు.తెలంగాణలో, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 20 పడకల ఆసుపత్రులు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 100 పడకలుగా మంజూరై నూతన భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మరి రామన్నపేట ఏం పాపం చేసిందని ప్రశ్నించారు.ఇప్పటికైనా స్థానిక ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం చొరవ తీసుకుని సీఎంతో మాట్లాడి రూ. 40 కోట్లతో 100 పడకల దవాఖాన మంజూరు చేయించాలని మండల ఉద్యమకారుల ఫోరం తరపున డిమాండ్ చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గర్దాస్ విక్రమ్

**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 4:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన జిట్టబోయిన పద్మ - మల్లేశం కుమారుడు నరేందర్ - సంధ్యల వివాహం రామన్నపేటలోని జేపీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జాక్ రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, సింగణబోయిన గణేష్, జిట్టబోయిన వెంకటేష్, మాజీ ఉప సర్పంచులు సింగణబోయిన జంగయ్య, గర్ధాస్ వెంకటేష్, చేనేత సహకార సంఘం చైర్మన్ రవ్వ నర్సింహా, చిన్నపాక శ్రీనివాస్, నక్క వెంకటేష్, పాలసంఘం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, డైరెక్టర్ గర్ధాస్ వెంకటేష్, రాదారపు మల్లేశం, చిన్నపాక సురేష్, మాధం నాగేష్, బోనగిరి మధు, శేఖర్, దినేష్, చెవ్వ యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# బిరుశెట్టి గూడెం సంతలో ముత్ర శాల లేక అవస్థలు

**తొలి అక్షరం/దంతాలపల్లి సెప్టెంబర్ 4:** దంతాలపల్లి మండలం భీరిశెట్టి గూడెం లో ప్రతి శుక్రవారం జరిగే వారం సంతలో ముత్ర శాల సౌకర్యం లేకపోవడంతో వ్యాపారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారాలు చుట్టుపక్కల మలమూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి నెలకొంది ఇప్పటికైనా అధికారులు స్పందించి సంత స్థలంలో మూత్రశాల ఏర్పాటు చేయాలని వ్యాపారులు ప్రజలు కోరుతున్నారు



## గాయత్రి హైస్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి జయంతి వేడుకలు



**తొలి అక్షరం :వలిగొండ, సెప్టెంబర్ 04:** గాయత్రి స్కూల్ లోని గురువారం రోజు, గోకుల కృష్ణాష్టమి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, గాయత్రి ప్రిన్సిపల్ అనురాధ మాట్లాడుతూ, కృష్ణుడు చేసిన చిలిపి మాటలు, అతడు చేసే వెన్న దొంగ పనులు అలనాటి బాల్యంలో చేసిన పనులను, స్మరించుకుంటూ,ఉట్లు కొట్టి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, చైర్మన్ తవటం నరహరి, మురళీధర్ రెడ్డి, పాలకూర వెంకన్న గౌడ్, భీమిడి కవిత, కొంతం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం సందర్భంగా ఘనంగా వరలక్ష్మీ వ్రతం



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 4:**శ్రావణ మాసం ప్రతి శుక్రవారం విశిష్టంగా జరుపుకునే వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.ఈ వ్రతంలో గడ్డం లక్ష్మి, వేమన సాహితి, చంద్రగిరి నాగమణి, ఎనగందుల లత, చిరునాముల మౌనిక, రావుల కోణాలు శ్రీలత, తిరుమదాసు నవ్య, గడ్డం శ్రీనిధి, కట్టమూరి జ్యోతి, గొల్ల కామేశ్వరి, అనురాధ, కాకా రాజా, ఆకుల రమ్య తదితర మహిళలు పాల్గొని వ్రతాన్ని ఆచరించారు.పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని మనసారా వరలక్ష్మీ దేవిని వేడుకున్నారు. అనంతరం పసుపు, కుంకుమ, గాజులు, చీరలను వాయినంగా తీసుకున్నారు.

## అనారోగ్యంతో మనస్తాపం వృద్ధుడు ఆత్మహత్య



**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 4:**రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన నాగు కృష్ణయ్య (60), తండ్రి బిక్షపతి కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు.ఈ క్రమంలో తేదీ 01.09.2026 మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో పొలం వద్ద పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కామినేని ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ తేదీ 03.09.2026 రాత్రి 08:20 గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వెలువర్తిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**తొలి అక్షరం :వలిగొండ సెప్టెంబర్ 4:** మండల పరిధిలోని వెల్వర్తి గ్రామంలో యాదవ సంఘం అధ్యక్షులు చెముడాల మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకటరమణ రెడ్డి హాజరవ్వగా వారి సమక్షంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఉట్లు కొట్టి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షులు చెముడాల మల్లేశం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని, అదేవిధంగా గ్రామ ప్రజల సమక్షంలో ఉట్ల కార్యక్రమం కులమతాలకు అతీతంగా సంతోషంగా జరుపుకుంటామని తెలిపారు. చెముడాల చంద్రయ్య, కృష్ణయ్య యాదవ్, మహేందర్, అశోక్ ముత్యాలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్ఎం ఇట్లా! అసిస్టెంట్ అట్లా! బడి ఎట్లా?

**• ఎఫ్ ఆర్ ఎస్ వచ్చినా మారని తీరు**

**- రామన్నపేట మండలంలో కొందరు టీచర్ల నిర్లక్ష్యం**

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 4:** పాఠశాల విద్యలో ఎఫ్ ఆర్ ఎస్ విధానం వచ్చినా తీరు మార్చుకోని ఉపాధ్యాయులు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు వచ్చి బోధనపై శ్రద్ధ తీసుకోవాలన్న బాధ్యతను కొందరు మరిచారు.మొదటి పీరియడ్‌లో అల్పాహారం తీసుకోవడం సాధారణ విషయమైంది. అది వారి హక్కుగా మారింది. బోధనకు ఆటంకం కలగకుండా 15 నిమిషాలు ముందు వచ్చి అల్పాహారం చేసే వారు లేరు. దీంతో ఆరంభంలోనే బోధన కుంటుపడుతోంది. దీనిని నివారించాలనే ధ్యాస హెచ్ఎం లకు లేదు. అందుకు కారణం వారు కూడా అల్పాహారం తీసుకోవడం సాధారణమైపోవడమే.ఇక చివరి పీరియడ్‌లో క్లాస్‌కు వెళ్లడం లేదు. కారణం చిరుతిండ్లు తినడం. విద్యార్థులను గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. స్వల్ప విరామ సమయంలో చిరుతిండ్లు తింటే ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ఎనిమిది పీరియడ్లకు ఎనిమిది పీరియడ్లు బోధించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు వినియోగదారులుగా మారిపోవడం మరో ప్రత్యేక లక్షణం. వ్యాపారస్తులకు ఫోన్ చేసి పచ్చి చేపలు, నాటుకోళ్లు, కొట్టిన పసుపు, దంచిన కారం, బాతు గుడ్లు, గానుగ నూనె మొదలైనవి పాఠశాలకు తెప్పించుకుని బేరం చేసి మరీ కొనడం కొందరి ఉపాధ్యాయుల కళగా మారింది.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వీరు శూన్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వీరిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సమాజం కోరుకుంటోంది.

## కంటికి రెప్పలా కార్యకర్తలను కాపాడుకుంటా...: దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 4:**నకిరేకల్ నియోజకవర్గం, కేతేపల్లి మండలం కొర్లపాడు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సూరారపు వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయంగా రూ. 10,000 అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, కొర్లపాడు మాజీ సర్పంచ్ కుమ్మరి నాగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు భయ్యా అంజయ్య యాదవ్, ఇప్పలగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు సైదులు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండ బుర్రయ్య, భద్రయ్య, అంజిబాబు, ప్రశాంత్, లింగరాజు, బబ్లు, ఆవు దొడ్డి లింగయ్య, ఎడ్ల శీను, మహేష్, ప్రవీణ్, సూరారపు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫణిదర్‌నీ సన్మానించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు దూదీమెట్ల రాజమౌళి, గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల రాజు




**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ఇటీవల బదిలీ పై నెక్కొండ కు నూతనంగా విచ్చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫణిధర్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దుదిమెట్ల రాజమౌళి, రెడ్లవాడ గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల రాజు, పిట్టకాల బోడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ వీరన్న (చిన్న ) వార్డ్ నెంబర్ సీనియర్ నాయకులు పల్లకొండ వెంకన్న, గ్రామం ఉపాధ్యక్షులు బాదావత్ బాలాజీ, రెడ్లవాడ యూత్ అధ్యక్షులు సుంకర బోయిన రాజశేఖర్, బండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సుశీల్ కుమార్ షిండేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పూస బాలకిషన్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 4:**మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ హోం మంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన మహనీయులు సుశీల్ కుమార్ షిండే నీకాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినారు.

## ఎల్లలు దాటి అమెరికాలోనూ వెల్లివిరిసిన కృష్ణ భక్తి.





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన ప్రముఖ రిపోర్టర్ దేసు లక్ష్మణ్ మనవడు బ్లూమింగ్టన్ (ఇలినాయిస్) లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అమెరికాలోని చికాగో సమీప బ్లూమింగ్టన్‌లో భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఘట్కేసర్‌కు చెందిన బెలిదే శ్రీకాంత్‌సింధుజ దంపతులు తమ పిల్లలు నిశ్రుద్, క్రితిక, లకు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ నామస్మరణతో వారి ఇంట్లో పండుగ సందడి నెలకొంది. విదేశాల్లోనూ భారతీయ సంప్రదాయాలను కొనసాగిస్తూ పిల్లలకు సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయడం అభినందనీయమని పలువురు అన్నారు.

# ఇంటింటికి చెట్లను పంపిణీ చేసిన సర్పంచ్ చైతన్య నాగరాజు



**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 04:** నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో చెట్టును నాటిన గ్రామ చైతన్య నాగరాజు మొక్కలు నాటడం జరిగింది.సర్పంచ్, మాట్లాడుతూ చెట్లను నాటడం వలన పర్యావరణ పరిరక్షణ రక్షించుకోవాలి బాధ్యత ప్రతి ఒక్కరు పైన ఉంటుందని చెప్పారు. స్వచ్ఛమైన గాలి వాతావరణం మెరుగు పడుతదని అని ప్రతి ఒక్కరు చెట్టును నాటి దాని సంరక్షించాలని తెలిపారు. అదేవిధంగా చెట్లు ఉండడం వలన వర్షాలు పడతాయని చెప్పారు. చెట్లు ఉండడం వలన కాలుష్యం నివారణ ఉంటుందని అందుకే మొక్కలు నాటాలని ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉంటుందని చెప్పారు.ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమ్మనబోయిన మల్లయ్య, వార్డు మెంబర్స్ బొజ్జ రేణుక, వెంకటలక్ష్మి, భూక్య కళ్యానీ, నల్లని పాపారావు, భూక్యా రమేష్, మాడుగుల మధు, కన్న సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, గ్రామ సిబ్బంది గ్రామ ప్రజలుపాల్గొనడం జరిగింది.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు




**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని చిన్న కొల్పోల్ గ్రామానికి చెందిన కొయ్యడ సాహితి (స్వర్ణ) – మహిపాల్ చిన్నారులు సచిన్, విరాట్ లు కొయ్యడ దేవాన్ష్, దేవర్ష్ పాఠశాలలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొని చిన్నారుల యొక్క ఆనంద ఉత్సాహాలతో కృష్ణాష్టమి వేడుకలను దిగ్విజయంగా, కనుల పండుగ నిర్వహించడం జరిగింది. శ్రీ కృష్ణాష్టమి అంటే చిన్నారుల యొక్క బుడిబుడి నడకలు, చిరునవ్వులు చిందించే పండుగ వాతావరణాన్ని కల్పించడం జరిగింది.

## మడికొండ జంక్షన్‌లో ఘనంగా 1000 రోజుల ప్రజా పాలన పూర్తి సంబరాలు

**- ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం,45వ డివిజన్ పరిధిలోని మడికొండ జంక్షన్‌లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి కలిసి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా,ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ విజయవంతంగా ముందుకు సాగుతోందని కొనియాడారు.ప్రజా రంజక పాలన అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కాజీపేట సోమిడి 62వ డివిజన్ లో శ్రీ రాధాకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అభిషేక కార్యక్రమాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలు జక్కుల రమ రవీందర్ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు.అనంతరం చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.అలాగే ఆడపడుచులు,మహిళలు నిర్వహించిన నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.ఆలయ ప్రాంగణం శ్రీకృష్ణ నామస్మరణతో,భక్తి ఉత్సాహంతో సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో కాజీపేట యాదవ సంఘం పెద్దలు,యాదవ సోదరీమణులు,మహిళలు,62వ డివిజన్ కాలనీవాసులు,చిన్నారులు శ్రీ రాధాకృష్ణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులందరూ రాధాకృష్ణుల ఆశీస్సులు పొంది, కార్యక్రమాన్ని విజయవంతం చేశారని జక్కుల రవీందర్ యాదవ్62వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ తెలిపారు.

# డీసీసీ అధ్యక్షులు ఇనగాలను కలిసిన గుండు సుధారాణి




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన గుండు సుధారాణి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆమె,ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న గుండు సుధారాణికి శాలువా కప్పి,హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. చోరీ నిందితుడు అరెస్ట్

**- షాద్‌నగర్‌లో రాత్రి చోరీలకు చెక్.. దొంగ అరెస్ట్**



**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్04:** రాత్రి వేళ తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న రోహిత్ కుమార్ (23)ను షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేశంపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లోకి చొరబడిన నిందితుడు ఐఫోన్, ఆపిల్ వాచ్, రూ.20 వేల నగదును అపహరించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. బిహార్‌కు చెందిన రోహిత్ ప్రస్తుతం కొత్తూరులో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సీ. సిరీష, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కేసును ఛేదించినట్లు సీఐ సీతారాం తెలిపారు.

# కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు యాదవులు ఐక్యం కావలసిన అవసరం ఉంది

**హనుమకొండలో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు**

**ఆకట్టుకున్న ఒగ్గు డోలు నృత్యాలు,సాంస్కృతిక ప్రదర్శనలు**

**హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్,ధర్మారవు,బిజెపి రాష్ట్ర నాయకురాలు రావు పద్మ**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎస్ .సుందర్ రాజ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ముందుగా రామ్ నగర్ నుంచి అంబేద్కర్ సెంటర్,అశోక సెంటర్,బస్టాండ్ మీదుగా కాళోజి కళాక్షేత్రం వరకు శ్రీకృష్ణుడి రథయాత్ర నిర్వహించారు.భారీ రథయాత్రను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఈ సందర్భంగా ఒగ్గు డోలు కళాకారుల నృత్యాలు,సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.ప్రముఖ గాయకులు మల్లిక్ తేజ,కోమల టీమ్ ఆటా పాట ఉత్తేజపరిచాయి.కళాక్షేత్రం ఆవరణ గొల్లకురుమలు,శ్రీకృష్ణుడి భక్తులతో కిక్కిరిసిపోయింది.వేడుకలకు బీఆర్ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత మదుసుదానాచారి,పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్,మార్తినేని ధర్మారావు,ఢిల్లీకి చెందిన యాదవ సంఘం నేతలు డాక్టర్ అజిత్ యాదవ్,శైలజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..తాను కాళోజీ కళా క్షేత్రంలో చూసిన అతి పెద్ద కార్యక్రమం ఇదేనన్నారు.సుందర్ రాజ్ యాదవ్ కోరినట్లు కృష్ణ మందిరం,యాదవ హాస్టల్ నిర్మాణం కోసం హన్మకొండ పరిధిలో ఎకరం భూమికి తక్కువ కాకుండ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.గొల్లకురుమలు నిర్వహించే కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.రాజకీయాలకు అతీతంగా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం,అందరినీ ఒక వేదిక మీదికి తీసుకురావడం అభినందనీయమన్నారు.యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ...గత నాలుగేళ్లుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు.కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు యాదవులు ఐక్యం కావలసిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ్ వెల్ఫేర్ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు,పెద్ద సంఖ్యలో గొల్ల,కురుములు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌పై కదనభేరి

**- వెయ్యి రోజుల పాలనతో మహిళలకు మిగిలింది నిరాశే**

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**- హామీలు నెరవేర్చేదాకా ఉద్యమిస్తాం: ఉషా దయాకర్‌రావు**

**- అన్నారం రోడ్డులో ఘనంగా బీఆర్ఎస్ వంటా-వార్పు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో- తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),సెప్టెంబర్4:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు మాత్రం కాగితాలకే పరిమిత మయ్యాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ శుక్రవారం తొర్రూరు డివిజన్ పరిధిలోని అన్నారం రోడ్డులో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో భారీ ఎత్తున వంటా-వార్పు నిరసన కార్యక్రమం చేపట్టింది.ఈ నిరసనలో ఎర్రబెల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉషా దయాకర్‌రావుతో కలిసి దయాకర్‌రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత బస్సు ప్రయాణాన్ని చూపించి మిగతా పథకాలన్నింటికీ మంగళం పాడారు అని విమర్శించారు.నెలకు రూ.2,500 సహాయం ఏమైంది? ఓట్ల కోసం ఆశచూపి అధికారంలోకి వచ్చాక దగా చేయడం కాంగ్రెస్‌కే చెల్లింది అని ఎర్రబెల్లి అన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రతీ మహిళకు రూ.2,500 పథకాన్ని వెంటనే ఖాతాల్లో జమ చేయాలి అని డిమాండ్ చేశారు.గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేయడం ఆపి, ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకోవాలి అని సూచించారు.కేసీఆర్ హయాంలోనే మహిళా సమాఖ్యలకు, సంక్షేమానికి నిజమైన గుర్తింపు లభించింది అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్,మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్యలతో పాటు పసుమర్తి సీతారాములు, నల్లమాస ప్రమోద్, బిందు శ్రీనివాస్,కుర శ్రీనివాస్,అంకుస్,కాలు నాయక్, పసుమర్తి శాంత,పల్లె దేవమ్మ,కౌన్సిలర్లు భవాని లత, కిన్నెర కవిత, ధరావత్ పద్మ,శ్యామల,కర్నే నాగరాజు, తూర్పాటి రవి,పేర్ల జంపన్న, సర్పంచ్ మౌనిక సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై పెనుబల్లిలో బీఆర్ఎస్ సమరశంఖం

**మహిళలతో భారీ ర్యాలీ.. వంటా వార్పుతో నిరసన**

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య**




**తొలి అక్షరం/పెనుబల్లి, సెప్టెంబర్ 4:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్రంగా మోసం చేస్తోందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన 1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా పెనుబల్లి మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో పెనుబల్లి గెస్ట్‌హౌస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వేలాది మంది మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో పెనుబల్లి వీధులన్నీ గులాబీమయంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రహదారిపై వంటా వార్పు నిర్వహించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు గడిచినా ఆ హామీలను అమలు చేయలేదు అని మండిపడ్డారు. విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం, అర్హులందరికీ ఇళ్లు, పెన్షన్ల పెంపు వంటి హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజల్లోకి వచ్చి పోరాటం ప్రారంభిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు, ప్రజల సంక్షేమం గుర్తుకు వస్తోంది అని సండ్ర ఎద్దేవా చేశారు. పెనుబల్లిలో బీఆర్ఎస్ వంటా వార్పు కార్యక్రమానికి పిలుపునిచ్చిన వెంటనే కాంగ్రెస్ నాయకులు హడావుడిగా చీరల పంపిణీకి తెరలేపడం ఇందుకు నిదర్శనమన్నారు.పాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం సరికాదని సండ్ర అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని, ప్రతిపక్షాలపై నిందలు వేయడం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం కావని హితవు పలికారు. 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని తెలిపారు.పెనుబల్లి వేదికగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ గళాన్ని బలంగా వినిపించడం పట్ల సండ్ర వెంకట వీరయ్య హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

# మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి

**మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిర మహిళాశక్తి పథకం అండ**

**మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం..**

**వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు**

**సత్తుపల్లిలో ఇందిర మహిళాశక్తి సదస్సు లో పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన మంత్రి సీతక్క**



**తొలి అక్షరం/సత్తుపల్లి, సెప్టెంబర్ 4:** మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో 1000 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి పాల్గొన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని మంత్రి తెలిపారు. మహిళలు తమకు నచ్చిన వ్యాపారాలను ప్రారంభించి, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. ఇందుకోసం మహిళా సంఘాలకు ఏపీఎంలు, డీఆర్‌డీఓ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘాల సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పల్లె, గూడెం, తండా, వాడలో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ంహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళా అర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు.త్తుపల్లిలో కూడా టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తుల ఆధారంగా వివిధ వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. స్థానికంగా లభించే ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే మహిళలకు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, కలెక్టరేట్లు, ఇతర ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మహిళలు క్యాంటీన్ల ద్వారా నెలకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు.


# సంపాదకీయం

## ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

- లైసెన్స్ మినహాయింపు ఎత్తివేయాలి
- కేంద్రానికి రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ లేఖ

**విజయవాడ, సెప్టెంబర్ 4:** ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు మద్యం ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. వాటి విక్రయాలపై నియంత్రణ అవసరమని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పీ. అరుణ్‌బాబు పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు ఇచ్చిన లైసెన్స్ మినహాయింపును ఇథనాల్ ఆధారిత శానిటైజర్లకు వర్తించకుండా ఉపసంహరించాలని కోరుతూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా)కు లేఖ రాశారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల సులభ లభ్యత కోసం కేంద్ర ప్రభుత్వం 27-07-2020న ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్ ద్వారా వాటి నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చిందని అరుణ్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఈ మినహాయింపును కొందరు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో మద్యానికి బదులుగా ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు, దాడులు జరిపి కొన్ని రిటైల్ మెడికల్ షాపులు ఇథనాల్ ఆధారిత శానిటైజర్లను పెద్ద మొత్తంలో విక్రయించినట్లు గుర్తించామన్నారు. విజయవాడ పటమటలోని సాయి వెంకటేశ్వర ఫార్మసీ అండ్ సర్జికల్‌కు సంబంధించిన బిల్లులను స్వాధీనం చేసుకున్నామని, వాటి ప్రకారం ఏడాదిన్నర కాలంలో సుమారు 33,586 ఇథనాల్ 70 శాతం వీవీ (100 ఎంఎల్) సీసాలను కొనుగోలు చేసి విక్రయించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మూడు రిటైల్ విక్రయ కేంద్రాలపై లైసెన్స్ రద్దు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ఇచ్చిన మినహాయింపు నాలుగేళ్ల తర్వాత కూడా కొనసాగుతుండటం వల్ల ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఇథనాల్ లేని ప్రత్యామ్నాయ హ్యాండ్ శానిటైజర్లు అందుబాటులో ఉన్నందున.. ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి ఇచ్చిన మినహాయింపును ఉపసంహరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పీ. అరుణ్‌బాబు కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్‌ను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## "నిటి ఆయోగ్" నివేదికలో విద్యావైఫల్యాల బండారం!




ప్రపంచంలో అతిపెద్ద విద్యావ్యవస్థ మనది. దాదాపుగా 25 కోట్ల మంది విద్యార్థులు 14.71 లక్షల విద్యాలయాలలో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలన్నీ కలిపి 10,92,671 ఉన్నట్లుగా గణాంకాలు తెలుపుతున్నాయి. కానీ 65 శాతం మంది విద్యార్థులు ఇంకా ప్రైవేటు విద్యా వ్యవస్థనే నమ్ముకున్నారు. ఇదంతా పార్లమెంటరీ కమిటీ నివేదికలో పేర్కొన్న వాస్తవాలు. 73 శాతం విద్యార్థులు ఉన్నత విద్యా స్థాయికి చేరుకోకముందే డ్రాపౌట్లుగా మిగిలిపోతున్నారు. శారీరక వైకల్యం కల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు మృగ్యం. అంటే కేటాయింపులన్నీ కాగితాలకే పరిమితం కానీ క్షేత్రస్థాయిలో వినియోగం జరగడం లేదు. పర్యవసానంగా కోట్లాదిమంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. కనీస ఆర్థిక స్థోమత గలవారు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారంటే వారికి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లుతున్నదనే భావించాలి. 2005లో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ 71 శాతం ఉండగా 2024-25 నాటికి అది 49.24 శాతానికి పడిపోయింది. రెండు దశాబ్దాల కాలంలో ప్రభుత్వ విద్యావ్యవస్థలో అడ్మిషన్లు తగ్గిపోవడం అంటే అదే స్థాయిలో ప్రైవేట్ పాఠశాలలకు తల్లిదండ్రులు ఓటు వేసినట్లే. ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల లేమి, కంప్యూటర్ శిక్షణ లేకపోవడం, ఫలితాలు, ప్రమాణాలు అడ్మిషన్లను ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. భవనాలు, టాయిలెట్స్, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో లేవనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుపోయింది. సెకండరీ విద్య అందించే వాటిలో ప్రైవేటు స్కూళ్ల భాగం 44 శాతానికి పైగా ఉంది. దేశంలో లక్షకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. **చదువుకు ఉపాధికి మధ్య అంతరం** ఇక ఈ మే మాసంలో నిటి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక మరింత విస్తుపోయే అంశాలను పేర్కొన్నది. ఒకపక్క దేశంలో ఉపాధి కల్పనను పెంపొందించామని, నూతన విద్యా విధానం ద్వారా విద్యార్థులను స్వయం ఉపాధి దిశగా తయారు చేస్తున్నామని కేంద్రం చేసుకున్న ప్రచారం అంతా డొల్ల అని సదరు నివేదిక నిరూపిస్తున్నది. 15 నుంచి 29 ఏండ్ల మధ్యనున్న యువకులలో 8.7 కోట్ల మంది అటు విద్యకు, ఉపాధికి, శిక్షణకు అందకుండా ఉన్నారని చెప్పడం బాధాకరం. వీరు కాక మరో రెండు కోట్ల మంది యువత కూడా ఏ ఉద్యోగం చేయడం లేదని నివేదిక తెలుపుతున్నది. వారిని నీట్ (నాట్ ఇన్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్) కేటగిరీలో చేర్చారు. దేశంలో కేవలం 8.25 శాతం మంది పట్టభద్రులు మాత్రమే తమ డిగ్రీలకు తగిన ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పడం కూడా శోచనీయం. అంటే తొంభై శాతం మంది పైగా తాము చదివిన చదువుకు, చేస్తున్న పనికి సంబంధం లేకుండా ఉద్యోగాలు చేస్తున్నారు. మన చదువులు ఏ రకమైన ఉపాధిని, ఉద్యోగాలను కల్పించలేకపోతున్నాయని ఇది నిరూపిస్తున్నది. నైపుణ్యాలు కల్పించడంలో ప్రస్తుత విద్యా విధానం విఫలమైనట్లు స్పష్టమవుతున్నది. **డిగ్రీలు పెరుగుతున్నా నైపుణ్యాలు తగ్గుముఖం** దేశంలో ఇంకా రెండు కోట్ల మంది విద్యార్థినీ విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులు కాకుండా బీఏ, బీకాం, బీఎస్సీ వంటి సాంప్రదాయ కోర్సులనే అధ్యయనం చేస్తున్నారని నివేదిక తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోసం విద్యార్థులు ఈ డిగ్రీలు ఎంచుకుంటున్నారు. 2024 నవంబర్ నుంచి 2025 జూలై మధ్య కేవలం 55 వేల ఉద్యోగాల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం ఈ దుస్థితికి అద్దం పడుతున్నది. కానీ, వారికి వృత్తిపరంగా నైపుణ్యం నేర్పేవి కావు. వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్న పాఠశాలలు కేవలం 12లో ఒకటి మాత్రమే. అంటే వందకు ఎనిమిది పాఠశాలల్లో మాత్రమే వృత్తి విద్య అందుబాటులో ఉంది.

# భగవత్ సుభాషితాలు - ఆచరణలో విరుద్ధతలు!

"హిందువులు నిద్రలేస్తే ప్రపంచం మేల్కొన్నట్లే" ఇదీ అమెరికా, కెనడా, బ్రిటన్ పర్యటనలో భాగంగా కెనడాలోని టొరంటో నగరంలో జరిగిన సభలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చెప్పిన సుభాషితం. ఎంతో చక్కగా చెప్పారు, ఇంతకూ హిందువులు ఎప్పుడు నిద్రలేస్తారో చెప్పకుండా అది జరిగితే, ఇదైతే అని చెప్పటం వల్ల ఉపయోగమేమిటి? నిద్ర లేవకుండా ఎవరు అడ్డుకున్నారు? భగవత్ మూడు దేశాల పర్యటన అన్ని చోట్లా తీవ్ర వివాదాన్ని రేపింది. అవి నోరున్న దేశాలు గనుక వార్తలు ప్రపంచవ్యాపితంగా వెళ్లాయి. మనదేశ మీడియాలో కూడా చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నది బీజేపీ, తెరవెనుక ఉండి దాన్ని ఆడిస్తున్నది మాతృసంస్థ ఆరెస్సెస్ అన్నది జగమెరిగిన సత్యం. అలాంటి సంస్థ అధినేత పర్యటన అంటే ఒక రాజ్యాంగేతర శక్తి చేస్తున్నట్లే భావించాలి. తనను ఒక సాంస్కృతిక సంస్థగా కాషాయదళం చెప్పుకుంటుంది. కానీ, ప్రపంచానికి అది మేకతోలు కప్పుకున్న పులి, ఒక మతోన్మాద సంస్థగా అనేక మంది భావిస్తున్నారు. ఆ మచ్చను తుడిచివేసుకొనేందుకు వంద సంవత్సరాల క్రితం అది పుట్టినప్పటి నుంచీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. భారత్ విశ్వగురువుగా మారింది తప్ప విశ్వశక్తి కాదని టొరొంటో సభలో ఆరెస్సెస్ అధినేత చెప్పారు. ప్రపంచ మిలిటరీ, జీడీపీలో అగ్రభాగాన ఉన్నందున అమెరికా ప్రపంచశక్తి అని భావిస్తే అదొకతీరు. మనం ఏ రంగంలో ముందున్నట్లు, గురువుగా ప్రపంచానికి నేర్పిందేమిటి? "హిందూ విశ్వ బంధు-స్నేహ బంధంతో ప్రపంచ ఆలింగనం" అనే ఇతివృత్తంతో కెనడియన్ హిందూస్ ఫర్ అవుట్‌రీచ్, రిలేషన్స్ అండ్ డైలాగ్(కోర్డ్) సంస్థ ఏర్పాటు చేసిన సభలో భగవత్ మాట్లాడుతూ భారత్ సూపర్ పవర్ కాదని, తన స్వంత వ్యక్తిత్వంతో ప్రపంచానికి సేవలు అందించిందని, భారత్ ఎదుగుదలను ఆధిపత్యంతో కాక సేవతో కొలవాలని అన్నారు. సేవ భారత జన్యుమూలాల్లోనే ఉందని, హిందువులు మేలుకొంటే ప్రపంచమే నిద్రలేచినట్లని చెప్పారు. ముస్లింలు, పార్సీలు, యూదులు, క్రైస్తవులు ఎక్కడైనా వేధింపులకు గురైతే భారత్‌లో ఆశ్రయం దొరికిందని, భారత పూర్వీకులు దేశాలను ఆక్రమించేందుకు కాక జ్ఞానాన్ని పంచేందుకు విదేశాలకు వెళ్లారని పేర్కొన్నారు. ఇక్కడ సమస్య యావత్ ప్రపంచానికి మన పూర్వీకులు జ్ఞానం ప్రసాదిస్తే, అది మన వేదాలు, పురాణాల్లో నిక్షిప్తమై ఉంటే దాన్ని మనం వినియోగించుకోకుండా "మ్లేచ్ఛులకు" అందించి వారు విమానాలు, క్షిపణులను తయారు చేసేందుకు ఎందుకు సహకరించినట్లు? పారిశ్రామిక విప్లవాన్ని, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి దూరంగా ఉండి, సమాజాన్ని నిచ్చెనమెట్ల వివక్షా పూరితంగా ఎందుకు తయారు చేసుకున్నాం. సముద్రాలు దాటి ప్రయాణించిన వారు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని ఎందుకు నిబంధనలు విధించినట్లు? మనపూర్వీకులు ప్రపంచాన్ని చుట్టి జ్ఞానాన్ని అందిం చారని చెబుతున్న వారు ప్రయాణాలను నిషేధించిన బౌధాయన ధర్మశాస్త్రం, మనుస్మృతి గురించి ఏం చెబుతారు. సముద్రాలు దాటితే కుల భ్రష్టులౌతారు, ఆచారాలు మంటకలుస్తాయని చెప్పిన ఆంక్షల నేపథ్యంలో భగవత్ చెప్పిన పూర్వీకులు విదేశాలకు వెళ్లారంటే వారు తిరుగుబాటుదారులై ఉండాలి. అలాంటి వారిని పొగుడుతున్న కాషాయ దళాలు మరోవైపు మనుస్మృతిని విమర్శించే వారిని హిందూ వ్యతిరేకులు అని ఎందుకు నిందిస్తున్నట్లు? సనాతనాన్ని కాపాడాలి లేదా పునరుద్ధరిం చాలని చెబుతున్నవారు సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలనుకుంటున్నట్లా, వెనక్కు నడపాలని చూస్తున్నారా? జనాలు ఊరూపేరులేని వాట్సాప్‌లకు మాత్రమే పరిమితం కాకుండా స్వంత మెదళ్లకు పని పెట్టాలి. హిందూ అంటే మతం కాదు, జీవన విధానం అని చెబుతారు. "నేను హిందూ అని చెప్పినపుడు ఆ పదాన్ని ఒక నిర్దిష్ట భాష, ప్రత్యేక ఆరాధన రూపం, లేదా ఏ జీవన శైలితోనూ నిర్వచించకూడదు. హిందువులు అందరినీ గౌరవించాలి, అందరినీ ఆమోదించాలి. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడాలి," అని భగవత్ చెప్పారు. ఆచరణలో కాషాయ దళాలు అలాగే ఉన్నాయా?




ఒకవైపు వసుధైక కుటుంబం అని చెబుతారు. మరోవైపు దేశంలో జనాభాను పెంచుతూ ముస్లింలు మెజారిటీగా మారేందుకు చూస్తున్నారని ఆరోపిస్తూ, హిందువులు పిల్లలను ఎక్కువగా కనాలని ప్రబోధించటం తెలీదా? దక్షిణ భారత్‌లో ఉన్న హిందువులు కుటుంబ నియంత్రణ ఎందుకు పాటిస్తున్నారు, ఉత్తర భారతంలోని వారు ఎందుకు ముందుకు రావటం లేదు? జనాభా నియంత్రణ అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రపంచ సగటు జననాల రేటు 2.23 కాగా, అంతకంటే తక్కువగా ఉన్న ముస్లిం దేశ సమాజాలు కూడా ఉన్నాయి. యావత్ ప్రపంచాన్ని మతపరంగా ముస్లింలతో నింపాలనే కుట్ర ఉంటే మాల్దీవులు, మలేషియా, బహరెయిన్, ఇరాన్, టర్కీ వంటి చోట్ల మనకంటే తక్కువగా జననాల రేటు ఎందుకు ఉన్నట్లు? ఏ దేశానికైనా జనాభా వృద్ధి రేటు 2.1గా ఉండాలన్నది ఆ రంగ నిపుణుల సిఫార్సు. మనదేశంలో సగటు రెండుగా ఉంది. ఇక మతాల వారీ చూస్తే ముస్లింలు 2.36, హిందువులు 1.94 ఉన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 1992లో ముస్లింలలో 4.41గా ఉన్న పిల్లలు 2019-21 నాటికి 2.36కు తగ్గారు. ఇదే కాలంలో రెండు మతాల వారి మధ్య ఉన్న తేడా 1.11 నుంచి 0.42కు తగ్గింది. కుట్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేసేవారు, నమ్మేవారు దీనికి ఏ సమాధానం చెబుతారు? యావత్ ప్రపంచం ఒకే కుటుంబం అని మోహన్ భగవత్ సెలవిస్తారు. వారి రాజకీయ ప్రతినిధి బీజేపీ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అని చెబుతుంది. చట్టసభల ఎన్నికల్లో మాత్రం దేశంలో 15శాతంగా ఉన్న ముస్లిం సామాజిక తరగతిలో ఒక్కరంటే ఒక్కరిని కూడా తమ అభ్యర్థులుగా నిలపదు. సోషల్ ఇంజనీరింగ్ పేరుతో అన్ని కులాలవారికీ ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని చెప్పే పార్టీ మత వివక్షతో అసలు అవకాశం కల్పించకపోవటాన్ని మతోన్మాదం లేదా మతవిభజనగాక ఏ పేరుతో పిలవాలి? మోహన్ భగవత్ పర్యటనకు మూడు దేశాల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. ఇక్కడ సమస్య వ్యక్తిగతం కాదు. భావజాలం, విద్వేష పూరిత వ్యాఖ్యలు, ఆచరణకు సంబంధించిన అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. ఆరెస్సెస్ సభతో కెనడాలో సామాజిక అశాంతి తలెత్తుతుందని, మైనారిటీలుగా ఉన్న ముస్లింలు, సిక్కులు, దళితులకు ముప్పు తలెత్తుతుందని ఎన్‌డిపి పక్ష ఎంపీలు ప్రభుత్వానికి బహిరంగలేఖ రాశారు. అక్కడి పౌర సమాజంలోని 267 సంస్థలు, బృందాలు కూడా భగవత్ ప్రవేశానికి అనుమతి ఇవ్వకూడదని, ఆరెస్సెస్‌ను నిషేధించాలని కోరాయి. దీనికి పోటీగా వందకుపైగా ఇండో-కెనడియన్ హిందూ సంస్థలు రాసిన లేఖలో ఆధారం లేకుండా నిషేధం విధించటం అన్యాయమైన రాజకీయ వత్తిడి అని, భగవత్ పర్యటనను అడ్డుకోవటమంటే కెనడా హిందూ సమాజం పట్ల వివక్ష చూపటమేనని పేర్కొన్నాయి. కెనడా మాజీ రక్షణ మంత్రితో సహా మరికొందరు ఆరెస్సెస్‌కు మద్దతు పలికారు. బ్రిటన్‌లో దక్షిణాసియా సంతతికి చెందినవారు, మానవహక్కుల బృందాలు పర్యటనను వ్యతిరేకించాయి. వసుధైక కుటుంబ ఉత్సవాల ముసుగులో అమెరికాలో ఏర్పాటు చేసిన మోహన్ భగవత్ పర్యటనపట్ల కూడా వ్యతిరేకత వెల్లడైంది. సభ జరిగిన మాడిసన్ స్క్వేర్ న్యూయార్క్ నగరంలో ఉంది. ఆ నగర మేయర్ జోహ్రాన్ మందానీ ఆరెస్సెస్ నేత పర్యటనకు తాను వ్యతిరేకమని, అయితే ఒక మేయర్‌గా భగవత్ కార్యక్రమాలను అడ్డుకొనే అధికారం తనకు లేదని చెప్పారు. జోహ్రాన్ తండ్రి గుజరాతీ మూలాలున్న అమెరికా పౌరుడు మహమ్మద్ మందానీ, తల్లి ప్రముఖ భారతీయ సినిమా దర్శకురాలు మీరా నాయర్. మూడు పదులు దాటిన జోహ్రాన్ న్యూయార్క్ నగరానికి తొలి ఇండియన్-అమెరికన్ మేయర్‌గా చరిత్రకెక్కారు. అమెరికా పార్లమెంట్‌కు సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మతస్వేచ్ఛ అమెరికా కమిషన్ (యుఎస్‌సిఐఆర్‌ఎఫ్) అమెరికా ప్రభుత్వ అధికారులు భగవత్‌ను కలవరాదని కోరింది. ఆరెస్సెస్ ఉపసంఘాలు మతపరమైన మైనారిటీల మీద హింసాత్మక చర్యలకు పాల్పడినట్లు ఆ సంస్థ నివేదికలో పేర్కొన్నది. ఈ సంస్థ పక్షపాతంతో కూడినదని, దానికి విశ్వసనీయత లేదని మన విదేశాంగ శాఖ ఆరెస్సెస్‌ను వెనుకేసుకు వచ్చింది. తీవ్ర వ్యతిరేకత తలెత్తిన నేపథ్యంలో సభా నిర్వాహకుల ఎక్స్ ఖాతాను ఆ సంస్థ యాజమాన్యం నిలిపివేసి వత్తిడి తరువాత పునరుద్ధరించింది. హిందూ అమెరికన్ ఫౌండేషన్ తగిన రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని సభకు హాజరయ్యేవారికి సూచించింది. ఇలాంటి సంస్థలు ఎంతగా రెచ్చగొట్టినా ఎలాంటి అవాంఛనీయ ఉదంతాలు లేకుండా కార్యక్రమం ముగిసింది. ఆరెస్సెస్ వ్యాపింపచేస్తున్న పచ్చి అవాస్తవాలు ఎన్నో. జాతిపిత మహాత్మా గాంధీని హత్యచేసిన గాడ్సే అంతకు ముందే తమ సంస్థనుంచి వెళ్లిపోయి హిందూమహాసభలో చేరాడన్నది వాటిలో ఒకటి. అయితే గాడ్సే ఎప్పుడు ఆరెస్సెస్‌లో చేరిందీ, ఎప్పుడు వెళ్లిపోయిందీ ఎలాంటి ఆధారాలు లేవు. అసలు ఆ సంస్థ సభ్యత్వం రహస్యం. నాథూరామ్ గాడ్సే, అతని సోదరుడు గోపాల్ గాడ్సే ఆరెస్సెస్‌లో చురుకైన కార్యకర్తలని, వారెప్పుడూ సంస్థ నుంచి బయటకు పోలేదని కుటుంబ సభ్యులు పదే పదే స్పష్టం చేశారు. గోపాల్ గాడ్సే మనుమడు సాత్యకీ సావర్కర్ ఒక పరువు నష్టం కేసులో 2026 ఆగస్టు నెలలో పూనా కోర్టులో సాక్ష్యమిస్తూ అదే చెప్పాడు. టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక సావర్కర్, గాడ్సే కుటుంబాలకు ఆరెస్సెస్‌తో ఉన్న సంబంధాల గురించి సాత్యకి చెప్పిన అంశాలను ప్రచురించింది. గాడ్సే కోర్టులో చేసిన వాదనలను పుస్తకరూపంలో అచ్చువేసి ప్రచారంలో పెడుతున్నది కాషాయ దళం తప్ప మరొక "దేశభక్తుడు" ఎవరూ కాదు. అయినా సరే గాడ్సేతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆరెస్సెస్ పదే పదే గోబెల్స్ ప్రచారం చేస్తున్నది. మోహన్ భగవత్ మూడు దేశాల పర్యటన సందర్భంగా ఆర్గనైజర్ పత్రికలో దాన్నే పునరుద్ఘాటించారు

# బతుకులు మారని రజకులు



తెలంగాణ ఏర్పడి పదమూడేండ్లు గడిచినా రజకుల బతుకుల్లో మాత్రం మార్పు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. రాష్ట్ర జనాభాలో 2.8 శాతం, బీసీ జనాభాలో సుమారు ఐదు శాతం ఉన్న ఈ వర్గంలో 75 శాతానికి పైగా ఇప్పటికీ సంప్రదాయ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ సర్వేల్లో అత్యంత వెనుకబడిన వర్గంగా గుర్తించినప్పటికీ, బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రతలో మాత్రం తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. ఎన్నికల హామీలు అమలుకాకపోవడం, వృత్తి స్థలాలు కబ్జాలకు గురవడం, విద్యుత్ సబ్సిడీ బకాయిలు పేరుకుపోవడం ఈ వర్గం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు పది లక్షల మంది రజకులు ఉన్నారు. వీరిలో అత్యధికులు బట్టలు ఉతకడం, ఇస్త్రీ, డ్రైక్లీనింగ్, లాండ్రీ వంటి వృత్తులపైనే ఆధారపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శుభ, శుభకార్యాలు, గ్రామ దేవతల పండుగలు, బోనాలు, దేవాలయాలకు సున్నాలు వేయడం వంటి సంప్రదాయ సేవలను కూడా రజకులే నిర్వహిస్తున్నారు. అయితే గ్రామాల్లో వారికి గతంలో జీవనాధారంగా ఉన్న ఇనాం, మాన్య భూములు అన్యాక్రాంతం కావడం, చాకిరేవు, దోబీఘాట్ స్థలాలు కబ్జాలకు గురికావడం వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వృత్తి గ్రామాల నుంచి పట్టణాలకు విస్తరిస్తున్నప్పటికీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడి, మౌలిక వసతులు లేక రజక వృత్తిదారులు పోటీని ఎదుర్కోలేకపోతున్నారు.

# మంధానకు ఇంకెప్పుడు కెప్టెన్సీ ఇస్తారు...?

## ● మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ డిమాండ్

మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై 124 పరుగులతో చెలరేగి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ రికార్డుల పర్వం వేళ భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న 30 ఏళ్ల స్మృతి మంధానను తక్షణమే టెస్టులు, వన్డేలు, టీ20లు అనే తేడా లేకుండా మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా ప్రకటించాలని అమితా శర్మ నేతృత్వంలోని జాతీయ ఎంపిక కమిటీని కోరారు. ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌ను జట్టు నుంచి తొలగించాలని తాను అనడం లేదని, కానీ ఆమె వయసు ఇప్పటికే 37 ఏళ్లకు చేరిందని డయానా గుర్తు చేశారు. హర్మన్ నుంచి కెప్టెన్సీ ఒత్తిడిని తొలగిస్తే ఆమె స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి మిడిల్ ఆర్డర్‌లో పరుగులు సాధించగలదని అభిప్రాయపడ్డారు. “మనం ప్రతిసారీ ఓపెనర్లపైనే ఆధారపడలేం కదా. మిడిల్ ఆర్డర్‌లో హర్మన్ ఫామ్ జట్టు విజయాలకు ఎంతో ముఖ్యం. అందుకే స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, హర్మన్‌ను సీనియర్ ప్లేయర్‌గా కొనసాగించాలి” అని డయానా విశ్లేషించారు. ప్రస్తుతం స్మృతి మంధాన మంచి ఫామ్‌తో పాటు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని, నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి ఇది సరైన సమయమని డయానా పేర్కొన్నారు. స్మృతి సుదీర్ఘకాలం కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉంటుందని, ఆమెకు డిప్యూటీగా జెమీమా రోడ్రిగ్స్ లేదా షఫాలీ వర్మలను వైస్ కెప్టెన్లుగా నియమించి భవిష్యత్ సారథులుగా తీర్చిదిద్దవచ్చని సూచించారు. కనీసం పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనైనా స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, టెస్టుల్లో హర్మన్‌ను కొనసాగించినా పర్లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కాగా, కెప్టెన్సీకి తాను సిద్ధంగానే ఉన్నానని స్మృతి ఇప్పటికే ప్రకటించడం గమనార్హం. మరోవైపు మిథాలీ రాజ్ ఆల్‌టైమ్ పరుగుల రికార్డును మంధాన అధిగమించడంపై మిథాలీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “ఒక సాధారణ క్రీడాకారిణిగా కెరీర్ ప్రారంభించి అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా స్మృతి ఎదిగిన తీరును చూశా. నా రికార్డును దాటి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్‌గా ఆమె నిలవడం సంతోషంగా ఉంది” అని మిథాలీ పోస్ట్ చేశారు.



# మహిళల ఆసియాకప్‌లో భారత్ జోరు..



## హాంకాంగ్‌పై 137 పరుగుల తేడాతో విక్టరీ

మహిళల ఆసియాకప్ 2026లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచులో హాంకాంగ్‌ను 137 పరుగుల తేడాతో చిత్తు చేసింది. భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డు సెంచరీతో టీమిండియా ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 193/5 రన్స్ చేసింది. అనంతరం హాంకాంగ్‌ను 56 పరుగులకు ఆలౌట్ చేసింది. దీంతో గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు మంధాన, షఫాలీ వర్మ (28) శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు వేగంగా పరుగులు జోడించి జట్టుకు బలమైన పునాది వేశారు. 8 ఓవర్లలో 74 పరుగులు జోడించారు. షఫాలీ అవుటైన తర్వాత కూడా మంధాన తన దాడిని కొనసాగించింది. ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో మంధాన స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. హాంకాంగ్ బౌలర్లను ఊచకోత కోస్తూ.. ఆమె కేవలం 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసింది. ఆరంభంలో కాస్త నిలకడగా ఆడినా, కుదురుకున్నాక హ్యాట్రిక్ సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. మంధాన రాణించినా మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. ప్రతికా రావల్ (10), రిచా ఘోష్ (11), హర్మన్ ప్రీత్ కౌర్ (10) విఫలమయ్యారు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. 194 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టుకు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. నందిని శర్మ ఆరంభంలోనే వికెట్ తీసి హాంకాంగ్ పతనాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, ప్రేమా రావత్, శ్రీ చరణిలు వరుస వికెట్లతో విరుచుకుపడటంతో హాంకాంగ్ కోలుకోలేకపోయింది. కేవలం 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు, చివరి ఆరు వికెట్లను కేవలం 18 బంతుల వ్యవధిలోనే కోల్పోయి 16.2 ఓవరలలో 56 పరుగులకే ఆలౌటైంది. భారత్ 137 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ అత్యుత్తమంగా రాణించి కేవలం 9 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. ఆమెకు తోడుగా నందిని శర్మ (2/6), ప్రేమా రావత్ (2/12), శ్రీ చరణి (2/16) తలో రెండు వికెట్లు తీసి హాంకాంగ్ పతనాన్ని శాసించారు. ఈ విజయంతో భారత జట్టు గ్రూప్-ఏలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ టోర్నీలో తమ తదుపరి మ్యాచులో భారత్.. సెప్టెంబర్ 5న పాకిస్థాన్‌తో తలపడనుంది.

# టీ20 క్రికెట్‌లో శ్రీ చరణి అరుదైన ఫీట్!



దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు తన జోరును కొనసాగిస్తోంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణులు అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా యువ బౌలర్, తెలుగు తేజం శ్రీ చరణి తన అద్భుతమైన బౌలింగ్‌తో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ముఖ్యంగా శ్రీ చరణి తన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో హాంకాంగ్ పతనాన్ని శాసించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో కేవలం 3.2 ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి, 16 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టింది. ఈ ప్రదర్శనతో ఆమె ఒకే క్యాలెండర్ ఇయర్‌లో భారత మహిళల జట్టు తరఫున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో చరణి ఇప్పటివరకు మొత్తం 31 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో 2024లో 30 వికెట్లు తీసిన దీప్తి శర్మ రికార్డును ఆమె అధిగమించింది. ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ పూనమ్ యాదవ్ అగ్రస్థానంలో ఉంది. ఆమె 2018లో 35 వికెట్లు తీసి ఈ రికార్డును నెలకొల్పింది. చరణి ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఈ ఏడాది ముగిసేలోపు పూనమ్ యాదవ్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# అంతర్జాతీయ క్రికెట్ స్మృతి మంధాన రికార్డులు



భారత మహిళల క్రికెట్ స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన .. ఆసియాకప్ 2026లో సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్‌లో రికార్డుల బూజు దులిపేసింది. ఎన్నో ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న రికార్డులను ఆమె తన ఒక్క ఇన్నింగ్స్‌తో బ్రేక్ చేసింది. దుబాయ్ వేదికగా హాంకాంగ్‌తో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 మ్యాచ్‌లో 124 పరుగులు చేసింది మంధాన. దీంతో భారత మాజీ సారథి మిథాలీ రాజ్ పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించింది. మిథాలీ అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించిన 10,868 పరుగుల మైలురాయిని దాటి, ప్రస్తుతం 10,880 పరుగులతో ప్రపంచంలోనే అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా అగ్రస్థానంలో నిలిచింది.కేవలం పరుగుల రికార్డే కాకుండా, అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక సెంచరీల రికార్డును కూడా స్మృతి మంధాన తన ఖాతాలో వేసుకుంది. హాంకాంగ్‌తో సెంచరీతో తన శతకాల సంఖ్యను మంధాన 18కి పెంచుకుంది. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లాన్నింగ్ (17 సెంచరీలు)ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. మహిళల క్రికెట్‌లో పదివేల పరుగుల క్లబ్‌లో ఉన్న సూజీ బేట్స్, చార్లెట్ ఎడ్వర్డ్స్, స్టెఫానీ టైలర్ వంటి క్రికెటర్ల సరసన నిలిచిన మంధాన, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించి భారత్ గర్వపడేలా చేసింది. అంతేకాకుండా మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 4 వేర్వేరు క్యాలెండర్ సంవత్సరాలలో 500కు పైగా పరుగులు సాధించిన తొలి క్రికెటర్‌గా మంధాన నిలిచింది. 2026కు ముందు, ఆమె 2018, 2022, 2024 సంవత్సరాలలో ఈ మైలురాయిని అధిగమించింది.

# భారత్ - జపాన్ మధ్య చారిత్రాత్మక పోరు..



భారత్-జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని క్రికెట్ మైదానంలో ప్రత్యేక రీతిలో జరుపుకోనున్నారు. భారత పురుషుల క్రికెట్ జట్టు జపాన్‌తో ఓ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ఇటువంటి అంతర్జాతీయ మ్యాచ్‌లో ఈ రెండు జట్లు తలపడటం ఇదే మొదటిసారి కావడం ఈ మ్యాచ్‌ను చారిత్రాత్మకంగా నిలుపుతోంది. సుజుకి కప్ సెప్టెంబర్ 22, 2026న టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. జపాన్ క్రికెట్ అసోసియేషన్, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ప్రకటించాయి. భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెలలో ఆసియా క్రీడల కోసం జపాన్‌కు వెళ్లనుంది, కానీ దానికి ముందు జరిగే ఈ మ్యాచ్ చాలా ప్రత్యేకమైనది. టీమిండియా జపాన్‌తో తొలిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ప్రపంచంలోని అత్యంత బలమైన క్రికెట్ జట్లలో ఒకటైన భారత్, జపాన్‌లో క్రికెట్‌కు కొత్త రూపునివ్వడంలో కీలక పాత్ర పోషించగలదు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ ఆ దేశంలో క్రికెట్‌ను అభివృద్ధి చేయడానికి, దాని ప్రాచుర్యాన్ని పెంచడానికి చాలా కాలంగా కృషి చేస్తోంది. అందువల్ల భారత జట్టుతో జరిగే మ్యాచ్ స్థానిక ఆటగాళ్లకు, క్రికెట్ అభిమానులకు ఓ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. భారత్, జపాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్ 'స్పోర్ట్ 75' చొరవలో భాగంగా జరిగే తొలి ఈవెంట్. క్రీడల ద్వారా ఇరు దేశాల మధ్య ప్రజల సంబంధాలను, సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. 2036 ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలన్న భారత ఆకాంక్షను కూడా పరిగణనలోకి తీసుకుంటూ, క్రీడా రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు భారత్, జపాన్ అగ్ర నాయకత్వం మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ చొరవ ఒక భాగం.ఈ మ్యాచ్ భారత క్రికెట్‌కు ఓ ముఖ్యమైన సందర్భమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అభివర్ణించారు. జపాన్‌లో భారత జట్టు పాల్గొనడం కొత్త ప్రేక్షకులను చేరుకోవడానికి ఓ అవకాశమని ఆయన అన్నారు. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న చిరకాల స్నేహ సంబంధాలను ప్రస్తావిస్తూ, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల్లో క్రికెట్ పాల్గొనడం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుందని సైకియా అన్నారు. క్రికెట్‌ను దాని సాంప్రదాయ ప్రాంతాలకు మించి తీసుకువెళ్లాల్సిన బాధ్యతను బీసీసీఐ అర్థం చేసుకుందని.. అక్కడ ఈ క్రీడను బలోపేతం చేయడానికి జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు.జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నవోకి మియాజీ.. భారత జట్టుకు జపాన్ ఆహ్వానం అందడాన్ని తమ సంస్థకు ఓ చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. ఆయన బీసీసీఐకి దాని మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, భారత క్రికెట్ అభిమానులు జపాన్‌కు తరలివస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మియాజీ స్థానిక జపనీయులకు కూడా ఈ మ్యాచ్‌ను వీక్షించి, తమ జట్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జపాన్ ఆటగాళ్లకు, భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం అంతర్జాతీయ స్థాయిలో తమను తాము పరీక్షించుకోవడానికి ఓ గొప్ప అవకాశం అవుతుంది.మరోవైపు ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బృందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. మొత్తం 768 మంది సభ్యులతో కూడిన భారత బృందంలో 503 మంది క్రీడాకారులు, 246 మంది అధికారులు, సహాయక సిబ్బంది, 19 మంది కంటింజెంట్ సిబ్బంది ఉన్నారు. ఆసియా గేమ్స్ నుంచి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విశ్రాంతి ఇచ్చారు. అప్‌కమింగ్ సిరీస్‌ల కోసం గంభీర్‌కు రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. గంభీర్ గైర్హాజరీలో వీవీఎస్ లక్ష్మణ్ జట్టును పర్యవేక్షించనున్నాడు. గంభీర్ సపోర్ట్ టీమ్ కూడా ఈ ఆసియా గేమ్స్‌కు దూరంగా ఉండనుంది.వీవీఎస్ లక్ష్మణ్‌కు సునీల్ జోషి, హృషీకేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్ సపోర్ట్ స్టాఫ్‌గా వ్యవహరిస్తారు. మహిళల జట్టుకు అమోల్ ముజుందార్ హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్ అనంతరం గంభీర్‌కు విశ్రాంతి ఇవ్వగా.. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. చైనా వేదికగా 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో రెండు జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. అప్పుడు పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించగా.. మహిళల జట్టును హర్మన్‌ప్రీత్ కౌర్ నడిపించింది.

# నా రిటైర్మెంట్ దగ్గరపడిందేమో : తాప్సీ



ప్రముఖ కథానాయిక తాప్సీ కొంత కాలంగా పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి సారించిన సంగతి తెలిసిందే. తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'గాంధారి' ఈరోజు నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దేవాశిష్ మఖీజా దర్శకత్వంలో, కనికా థిల్లాన్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ తన బిడ్డ కోసం పోరాడే పవర్‌ఫుల్ తల్లి పాత్రలో తాప్సీ కనిపించారు. ఇష్వాక్ సింగ్, జతిన్ సర్నా, స్వస్తికా ముఖర్జీ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం విడుదలై మంచి స్పందన పొందుతున్న తరుణంలో... తాప్సీ ఇండస్ట్రీ ధోరణిపై చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ... ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో వస్తున్న కొన్ని రకాల సినిమాలు, మార్కెట్ ధోరణిలను చూస్తుంటే తనకు నటనకు స్వస్తి చెప్పాలనే ఆలోచన వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కథల ఎంపికలో నాణ్యత, ప్రమాణాలు తగ్గించుకుని సినిమాలు చేయాల్సిన పరిస్థితి వస్తే, నటించడం మానేసి ప్రశాంతంగా రిటైర్ అవ్వడమే తనకు ఇష్టమని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా థియేటర్లలోకి వస్తున్న చిత్రాల తీరును గమనించి, "నా రిటైర్మెంట్ సమయం దగ్గరపడిందేమో" అని తన కుటుంబ సభ్యులతో కూడా సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిపారు.

తనకు నటనపై ఎంతో ప్రేమ ఉన్నప్పటికీ, ఎలాంటి స్క్రిప్ట్‌నైనా ఓకే చేసేంత గుడ్డి ప్రేమ మాత్రం కాదని తాప్సీ స్పష్టం చేశారు. మార్కెట్ ట్రెండ్స్ మారుతుంటాయని, కానీ మనం చేసే సినిమాలు చరిత్రగా మిగిలిపోతాయని చెప్పారు. పదేళ్ల తర్వాత తన ఫిల్మోగ్రఫీని తిరిగి చూసుకుంటే తనకైనా, తన అభిమానులకైనా సిగ్గుచేటుగా అనిపించకూడదనేది తన తాపత్రయమని వెల్లడించారు. కష్టపడి సంపాదించుకున్న గుర్తింపును కాపాడుకునేందుకు, తన ప్రమాణాలకు తగిన కథలనే ఎంచుకుంటానని ఆమె స్పష్టం చేశారు.

## తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా



బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు.



## చిరంజీవి 'కాకా'.. సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమా షూటింగ్‌పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. చిరంజీవి సహా ప్రధాన తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ సుదీర్ఘంగా, అత్యంత కీలకమని చిత్రబృందం తెలిపింది.

ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా, ""కాకా' సెప్టెంబర్ 7 నుంచి మళ్లీ యాక్షన్‌లోకి దిగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారు, ప్రధాన తారాగణం పాల్గొనే సుదీర్ఘమైన, కీలకమైన షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది" అని పోస్ట్ చేసింది. దీంతోపాటు సినిమాను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేసింది.ఇటీవలే చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'కాకా' టైటిల్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో చిరంజీవి రావులపాలెంలోని 'అమ్మాజీ ఆక్వా ఇండస్ట్రీస్'లో సూపర్‌వైజర్ సత్యంగా కనిపించారు. రొయ్యల చెరువులో పడిపోయిన తాళం చెవిని ఒక భారీ విద్యుదయస్కాంతంతో బయటకు తీయగా, దానితో పాటు తుపాకులు, ఇతర ఆయుధాలు రావడం టీజర్‌పై ఆసక్తిని పెంచింది. తాళం చెవికి ఉన్న 'ఐ లవ్ డాడ్' కీచైన్ సినిమాలో బలమైన భావోద్వేగ అంశం కూడా ఉందని సూచించింది. సినిమా వర్గాల నుంచి వస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఇటీవల చిత్రీకరించిన ఈ ఫైట్, సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు సమపాళ్లలో ఉన్నాయని చిత్రబృందం నమ్మకంతో ఉంది. ఇప్పటికే ఫస్టాఫ్ ఎడిటింగ్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి.ఈ భారీ చిత్రంలో అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో 'కాకా'పై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

# 'ఆర్‌సీ 17'కి అంతా సిద్ధం?

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన 'పెద్ది' చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లతో అఖండ విజయం సాధించిన జోష్‌లో ఉన్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, తన తదుపరి ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. 'రంగస్థలం' వంటి చారిత్రాత్మక ఇండస్ట్రీ హిట్ తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రానున్న '=జ17' ముహూర్తపు వేడుకలను రాబోయే దసరా పండుగ సందర్భంగా నిర్వహించి, నవంబర్ నుంచి మైత్రీ మూవీ మేకర్స్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మిక మందానా, రుక్మిణి వసంత్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకున్న రూటెడ్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' ఇటీవలే బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని అందుకుంది. జాన్వీ కపూర్



హీరోయిన్‌గా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో మెరిసిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎ.ఆర్. రెహమాన్ అందించిన స్వరాలు ప్రాణంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను కొల్లగొట్టి 'పెద్ది' చరణ్ కెరీర్లోనే సోలో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ భారీ విజయం అందించిన జోష్‌తో ఉన్న రామ్ చరణ్ తన నెక్స్ట్ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో సుకుమార్-రామ్‌చరణ్ కాంబినేషన్లో వచ్చిన 'రంగస్థలం' బాక్సాఫీస్ వద్ద ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో తెలిసిందే. చిట్టిబాబు పాత్రలో రామ్ చరణ్ ఒదిగిపోయిన తీరు, సుకుమార్ అద్భుత దర్శకత్వ ప్రతిభ వెండితెరపై ఒక క్లాసిక్‌గా నిలిచాయి. ఆ ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ '=జ17'పై మొదటి నుంచే భారీ హైప్ నెలకొంది.

## ఓటీటీలోకి కాంట్రవర్సీ మూవీ



ఇటీవల కొన్ని సినిమాలు విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలు లేదా సంభాషణల విషయంలో కొన్ని సంస్థలు ఈ చిత్రాలను వ్యతిరేకించడంతో అవి థియేటర్లలో విడుదల కావడం లేదు. అలాగే బోల్డ్ కంటెంట్ కారణంగా కూడా కొన్ని సినిమాలు విడుదల కాలేదు. అయితే, ఈ చిత్రాలు ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రేక్షకులు కూడా ఈ చిత్రాలను ఓటీటీలో చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అలా థియేటర్లలో నిషేధానికి గురై ఓటీటీలో సంచలనం సృష్టించిన సినిమా 'అన్‌ఫ్రీడమ్'. బాలీవుడ్ దర్శకుడు రాజ్ అమిత్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఉగ్రవాదం, మత ఛాందసవాదం, స్వలింగ సంపర్కం, ప్రేమ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సున్నితమైన అంశాలు ఉన్నాయి. దీంతో 2015లో ఈ చిత్రానికి భారతదేశంలో థియేటర్లలో విడుదలకు ఆమోదం లభించలేదు. 'అన్‌ఫ్రీడమ్' సినిమా కథ వివిధ పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఒకవైపు ఇది ఉగ్రవాదం, మత ఛాందసవాదం వంటి సమస్యలను ప్రస్తావిస్తూనే, మరోవైపు తమ సొంత గుర్తింపు, ప్రేమ, తాము కోరుకున్నట్లుగా జీవించే హక్కు కోసం పోరాడుతున్న వ్యక్తుల కథను ఆవిష్కరిస్తుంది.'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలో విడుదల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ)కి సమర్పించారు. అయితే, చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, సున్నితమైన అంశాలపై బోర్డు అభ్యంతరం తెలిపి, పలు మార్పులను సూచించింది. స్వలింగ సంపర్కానికి సంబంధించిన డైలాగులు, శృంగార సన్నివేశాలు, అలాగే ఉగ్రవాదానికి సంబంధించిన కొన్ని సీన్లు, డైలాగులను తొలగించాలని సెన్సార్ బోర్డ్ సూచించింది. అయితే నిర్మాతలు మాత్రం సెన్సార్ బోర్డు సూచించిన మార్పులు చేయడానికి నిరాకరించారు. సన్నివేశాలను లేదా కంటెంట్‌ను మార్చడం వల్ల సినిమా అంతా ఎఫెక్టివ్ గా ఉండదని దర్శక నిర్మాతలు భావించారు. దీని తర్వాత, చిత్ర బృందం సెన్సార్ బోర్డు నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీల్ చేసింది. అయినప్పటికీ, 'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలోని థియేటర్లలో విడుదల చేయడానికి అనుమతించలేదు.